విజయోత్సవము

[కథానిక]

= శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న =

మొన్న ఏడో తారీకునాటి ముచ్చట. పెళ్లి వారిల్లులాగుంది జానకమ్మగారిల్లు- ఎంతో సందడిగాను. ఉదయాన్ని నాలుగింటికే లేచి మా వెంకట్రావుగది అలంకరించి, తానూ ముస్తాబై ఏడు గంటలు కాకుండానే నన్ను కేకేసింది జానకమ్మ. ఆవేళకు నేనూ సిద్ధంగానే ఉన్నాను. అసలు నాకు నిద్దరపట్టి చచ్చింది కనకనా? అందులోనూ యీవిడ అలారంటైంపీసులా మొదలెట్టిందాయిరి, కావలసినంత గల్లంతు చేసుకుంటూనూ. తీరా స్టేషనుకు వెళ్లేసరికి రైలు రెండు గంటలు లేటు. మహా విసుక్కుంది ఆవిడ. అవును మరి విసుగుకాదూ? స్నేహితుణ్ణి అయినంతమాత్రాన్నే పరిపరివిధాల ఆలోచనలతో నాకు రాత్రి అల్లా నిద్దరపట్టింది కాదు గదా, మరి కట్టుకున్న ఆడదానికి యింకా యెంత ఆతృతగా వుండాలి? ఆమె అయితేనేం, నేనయితేనేం ఇప్పటికి అయిదేళ్లయింది వెంకట్రావును చూసి. ౧౯౪౦ లో ఉద్యోగాలకోసం ప్రయత్నిస్తూన్నప్పుడు కలిసివుండే వాళ్లం. తరవాత నేను ఢిల్లీ వెళ్లిపోవడం, వాడు మిలిటరీలో వి. సి. ఓ. గా చేరిపోవడం జరిగేయి ఆగ్రాలోనూ, అక్కడా వాడు తర్ఫీదులో వున్నంత కాలమూ వుత్తరాలు సక్రమంగానే వచ్చేవి; కాని అచిర కాలంలోనే సింగపూరు వేసేరు వాణ్ణి. మరికొన్నాళ్లకే అది కాస్తా జపానువాడు ఆక్రమించేడనీ, మనవాళ్లు కొందరు యుద్ధఖైదీ లయిపోయేరనీ వార్త! జానకమ్మ గుండెల్లో పిడుగుపడినట్టయింది. రేడియోలో ఆకబురు విన్ననాడు కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది. మేం ఎంతో ఓదార్చేం యీయుద్ధం ఎన్నాళ్లో వుండదనీ, వెంకటి త్వరలోనే తిరిగివచ్చేస్తాడనినీ. మొదట్లో ఆ అమాయకురాలు మా మాటలు నమ్మింది; కాని ఆర్నెల్లయినా వాడి భోగట్టాయే లేదు. రెడ్ క్రాస్‌వాళ్లకు రాస్తే "చెడుగు తెలిపేదాకా మంచి అనే యెంచండి" అని జవాబు వచ్చింది. రోజుకు రోజూ ఆవిడ మరీ కుషించిపోతూ వచ్చింది. మేం ఎంత ఓదార్చినా ఉస్సుమని ఒక్కనిట్టూర్పు తప్ప ఆమెలో ఆశాజ్యోతి లేశమయినా వెలిగించలేకపోయే వాళ్లం. అప్పటికీ నేను ఎప్పుడయినా పట్టుగా మాట్లాడితే "నేనే చిన్నపిల్లనయితే ఏ బిస్కట్ల టిన్నో కొనియిచ్చేవాడివి కాదూ బావా" అనేది అతిదీనంగా. దాంతో నాకూ కళ్లంట నీళ్లు తిరిగి పోయేవి, ఆమెధీరలలితస్వభావం అర్థంచేసుకుంటూం నేను. పాపం! బారసాలపీటలమీద చూసిన వాడి కూతురుకు యిప్పుడు అయిదోయేడు. పసితనపు అమాయికత్వంచేత తండ్రిని స్మరించి తల్లికళ్లు చెమ్మగిల్ల జేస్తూవుంటుంది.

గత రెండేళ్లబట్టీ వాడిదగ్గిర్నుంచి వుత్తరాలు—సంతకం మాత్రం స్వహస్తలిఖితంగా—వస్తూనే వున్నాయి గాని వాటిలో "నేను క్షేమం. మీరు క్షేమంగా వున్నారని తలుస్తాను" అన్న రెండు ముక్కలూ తప్ప యింకేమీ వుండేది కాదు. ఇలాంటి దైనా ఆర్నెల్లకో వుత్తరం! జానకమ్మకైతే యివి దొంగవుత్తరాలేమో నని అనుమానం కూడాను.

ఏమీ పాలుపోయేది కాదు. ఓనాడు మన సేనలు బర్మాలో పురోగమిస్తున్నా యనీ, కొంతమంది యుద్ధఖైదీలు విడుదల ఔతున్నా రనీ విని చాలా సంతోషించింది ఆమె. కాని ఒక్కనిమిషమే. "ఏమో, అంతమాత్రాన వీరిని ఏ ఖైదీల కేంపులో వుంచేరో మిత్రసేనలకు ఎల్లా తెలుస్తుందీ? తెలిస్తే సరా, వీళ్లు వెళ్లి వారిని విడిపించవద్దూ? తీరా విడిపించేక మళ్లీ యుద్ధం చెయ్యమంటారేమో. అలా గంటారా? యిన్నాళ్లూ హింసలుపడ్డ వాళ్లకి కాస్త విశ్రాంతి యివ్వరూ? మిగతా కొంతమంది ఖైదీలను యిళ్లకు పంపిస్తున్నారుటగా? అయితే వీరి కబురు రెందుకు తెలియడం లేదూ" యిలాగ్గా ఆలోచనా తరంగాల్లో పడికొట్టుకుని, తను ఎప్పటిచోటనే వున్నానని తెలుసుకుని మళ్లీ విచారాంబుధిలో క్రుంకి పోయేది జానకమ్మ. వాడి మాట యెలాగ వున్నా యీవిణ్ణి చూస్తే పరాయివాడికైనా యీబాధ వద్దు బాబూ అనిపించేది మాకు.

ఇలాగ్గా కృత్యాద్యవస్థల్లో కొట్టుకుపోతూవుంటే మొన్న వచ్చిందోతంతి, వెంకట్రావు యివాళ వస్తున్నా డని. వెంటనే మా దొరదగ్గిర సెలవుపుచ్చుకుని యింటికి వచ్చేసి జానకమ్మతో చెప్పేను యీ సంగతి. పరమానందభరితురా లయిపోయింది; ఇహ ఆశలన్నీ నిరాశలే అనుకుని అశోకవృక్షంక్రింద సీతాఅమ్మవారిలాగున్న పరమపతివ్రతకు మర్నాడు ఉదయాన్నే పతిసందర్శన లాభం కలుగబోతోంది. అప్పటి ఆమె మనస్తత్వం ఊహించుకోవలసిందే కాని వర్ణించడానికి వీలుకాదు. తీరా వెళ్లేసరికి రైలు లేటుకావడంతోటే విసుగు హెచ్చింది. అయినా "యీపాటికి ఆ స్టేషను దాటి వుంటుంది, యీ స్టేషను దాటివుంటుంది" అని కబుర్లు చెప్పుకుంటూనే వున్నాం. ప్రాణాహుతులు మాత్రమే పుచ్చుకుని సరిపుచ్చుకునే జానకమ్మకు ఆ నాడు లెమొనేడు ఎంతో రుచికరంగా కనపడింది. "నువ్వు ఏమీ అనకుండా వుంటావా నాన్నా, యిప్పుడే వస్తా" నంటూ నాలుగడుగులు అటు వెళ్లింది. ఎందుకో అనుకున్నాం. కార్ల ఓక్ టిన్నూ, అగ్గిపెట్టే కొని పట్టుకు వచ్చింది "వారికి సిగరెట్లు వుంటే భోజనం కూడా అఖ్ఖర్లే" దంటూనూ. ఎంతలోకి ఎంతమార్పు వచ్చింది! చూస్తూండగానే మెయిల్ సైట్ అని అరుపూ, వెంబడే ఆరాధ్యదేవతకు హారతి జేగంటలాగ మధుర మయిన ఘంటానాదం వినవచ్చేయి. జానకమ్మహృదయం కనిపెట్టినదానిలాగ రోజుకుంటూ వచ్చి మా ముందు ఆగింది రైలు. వీడు వి. సి. ఓ. గదా అని యింటరు క్లాసు వెతుకుతూవుంటే ప్రక్కనున్న ఫస్టులోంచి దిగి భుజం తట్టేడు వెంకటి. "ఓరి నీ యిల్లు బంగారం గాను! కెప్టెనువి ఎప్పుడయ్యేవురా" అని వాడి భుజకీర్తులు చూస్తూ నే నడిగిన ప్రశ్నకు "చాలాగాథ వుందిలే, రాత్రి చెబుతా" నంటూ మామగారికి నమస్కరించేడు. ఆయనా ఆశీర్వదించి లేవనెత్తేడు, కళ్లనీళ్లు కనబడకుండా తుడుచుకుంటూనూ. తరవాత జానకమ్మపక్కన నిల్చున్నాడు. ఆమె అనంతమయిన ఆనందబాష్పాలతోనే భర్తకు స్వాగత మిచ్చి తన సంతోషాన్ని వ్యక్తపరుచుకుంది. చిట్టితల్లిని ఎత్తుకో బోతే ఏడ్చింది కొత్తచేసి. స్టేషనులో వున్న బొమ్మలూ, బిసకత్తులూ కొని లంచం యిచ్చి మచ్చికచేసుకున్నాడు. ఆ రాత్రి వాడి భుజంమీదే నిద్దరోయింది పిల్ల......

౨

రాత్రి తొమ్మిదవుతుంది. భోజనాలు చేసి వాకిట్లో మంచాలమీద కూర్చుని ఆరంభించేం; బాతాఖానీ అంతులేకుండా సాగిపోతూంది. వెంకటి చెపుతూవుంటే ఒళ్లు ఝల్లుమనేది ఒక్కొక్కప్పుడు—

"అంత చులాగ్గా వచ్చిందనుకున్నావట్రా యీకేప్టెన్సీ? ఓమారేం జరిగిందనుకున్నావ్? మేం ఫీల్డులో వున్నప్పుడు మందూ గుండూ వచ్చే యని కబురు తెలిసింది. అవి తీసుకురమ్మని దొర నన్ను దగ్గిరున్న రైలుస్టేషనుకు పంపించేడు లారీ లిచ్చి. తీరా వెళ్లేసరికి "ఇదేమిటి? ఓ ఘంట క్రితమే

మీ మేజరు ఎవరో వచ్చి సామాన్లు పట్టుకెళ్లేరు. ఇవిగో వోచర్ల మీద సంతకాలు" అని చూపించేడు స్టేషను మేష్టరు. నేను నిశ్ఘాంతపోయి వెళ్లి మా దొరతో యీ సంగతి చెప్పేసరికి, "అయ్యో జపానువాడు మనవాళ్లను ఖైదీలుగా పట్టుకుని యిలాగే ఆడిస్తున్నాడు" అన్నాడు. తరవాత రెండు మూడుసార్లు తను వెళ్లినప్పుడూ యిలాంటి సంగతే జరిగింది. దీనికి వుపాయం ఆలోచించడం మొదలెట్టేం. ఎన్నిప్లాన్లు వేసినా సరిపోయిందికాదు. పదేపదే సరుకుపోతూ వుండడంవల్ల మాకు ప్రాణసంకటంగా వుండేది.

"మంత్రియుగంధరుడికి మాతృభూమి అయిన ఆంధ్రదేశంలో జన్మించి నువ్వుకూడా ఏమీ ప్రత్యుపాయం ఆలోచించలేకపోతున్నావుకదా సుబేదార్ సాహబ్"అన్నాడు దొర.

"చిత్తం. నాకు ఒక్కటే తరణోపాయం గోచరిస్తోంది"

"ఏమిటది?" అన్నాడు బహు ఆతృతగా—నూతిలో మునిగిపోతున్నవాడు ఏదైనా పట్టు దొరుకుతుందేమోనని తడుముళ్లాడినట్టు.

"మరేమీ లేదు. జపానుసైన్యాల్లో మనవాళ్లు వున్నారుకదా; వాళ్లలో ప్రతికూలంగా సంచలనం బయలుదేరతియ్యాలి. లేదా వాళ్లలాగే మనలో కొందరు నటించి ఆచోకీ పూర్తిగా కనిపెట్టాలి."

"కష్టసాధ్యమయిన పని"

"అయినా పట్టుదలగా పనిచేస్తే నెగ్గకపోలేం..."

ఆమర్నాడు మామూలుగా పటాలాన్ని తీసుకు వెళుతూవుంటే ఎక్కణ్ణుంచో ఓ గ్రెనేడు వచ్చి బంతిలా మామధ్యన పడింది. వెంటనే ముగ్గురు గాయపడ్డారు. నేను "ఫైరుఆర్డరు"(Fire Order)యిచ్చేను. మాపటాలం తుపాకులు పేల్చేరు నాలుగుదిక్కులా గురిచేసి. ఎక్కడ చూసినా ధాంధాం అన్న శబ్దం, పొగా తప్ప యింకేమీ లేదు. పదినిమిషాలయింతరవాత అటునుంచి ధ్వని లేకపోవడంతోటే కాల్చడం మానేసి పస్తాయించిచూసేం. ఏఖ్కడా శత్రువుజాడ లేదు. వెధవలు చచ్చేసేరనుకున్నాం; పురోగమనం ప్రారంభించేం. చిన్న అడివిలోంచి పోవాలి. చెట్లు దట్టంగా పెరగడంచేత చీకటిగా వుంది; దానికి తోడు కొండలోయ. అంతా జీమూతంగా వుంది. అడివి దాటేక నది ఒక్కటి వుంది. అందాకా వెళితేనేకాని నీళ్లచుక్కలు లేవు మాకు. యుద్ధం బడలికమూలాన్నయితేనేం, మూణ్ణాళ్లనుంచీ అలా సాగుతూ వుండడంమూలాన్నయితేనేం- మాకు మహా దాహం, ఆకలీ వేస్తున్నాయి. సంచీల్లో రొట్టెలు ఎండిపోయి తోలుముక్కల్లాగయిపోయినాయి. మీలా సావకాశపు భోజనాలుగనకనా? మార్చి చేస్తూనే తినాలి. తింటే తాగడానికి నీళ్లచుక్క లేవు. అంచేత ఎలాగో ఒహలాగ అడివి దాటడానికే నిశ్చయించేం. తీరా పదిఅడుగులు పెట్టేమో లేదో, పడపడ పళ్లు రాలినట్టు రాలేయి చెట్లమీదినుంచి హేండ్గ్రెనేడ్లు. అసలే తిండీ తిప్పలూ లేకుండావున్నారేమో, మా పటాలం యీదెబ్బతో నానాబీభత్సం అయిపోయింది. చూస్తూవుండగానే కోతుల్లా దిగిపోయినారు చెట్లమీదినుంచి కొంతమంది జపానువాళ్లు. మేం యుద్ధఖైదీలమైపోయేం. ఇదే గోరిల్లాయుద్ధం అంటేను.

3

తుపాకుల బేయొనెట్లు మావీపులకు ఆనించి మూడుమైళ్లు దిక్కుమాలిన ముళ్లదారిని నడిపించి వాళ్ల కేంద్రస్థానానికి తీసికెళ్లేరు. అక్కడ నా "భుజకీర్తులు" (Shoulder titles) తీసుకున్నారు. వాళ్ల ఆఫీసరు ఏమిటో అడిగేడు. నేను జవాబివ్వలేదు. ఫెడేల్మని లెంపకాయ లాగేడు గూబ గుయ్యిమనేటట్టు. మొహం తిరిగి క్రిందపడిపోయేను......తెలివివచ్చి చూచుకునేసరికి, మరి కొంతమంది యుద్ధఖైదీలతోసహా కాన్సెన్ట్రేషన్ కాంపులో వున్నానని తెలుసుకున్నాను. ప్రక్కనున్న హిందూస్థానీవాడితో "మీ పేరేమిటి?" అన్నాను హిందీలో. "ఇంగ్లీషులో ఏడవ్వోయి"

అంటూ కాలిబూటుతో తన్నేడు జపానుప్రిజను గార్డు. తరవాత సూరబాయదీవికి పంపించేరు. అక్కడ మాచేత రోడ్లు తుడిపించేవారు. పొద్దున్న అయిదింటి నుంచీ చీకటిపడేవరకూ మేం చేసిన హీనమయిన చాకిరీకి లెక్కలేదు. దానికితోడు బుర్రలు నున్నగా గీయించేసేరు, ఎండలో బాధపడాలని. ఇహ తిండి ఏమిటో తెలుసా? మూడుముద్దలు అన్నం, ఓడొక్కతో నీళ్లున్ను. ఒహొక్కనాడు మినప్పప్పు "పప్పు" చేసేవారు. వెధవజిగట! నాకు వాంతిఒచ్చేది. అలా మూడుఏళ్లు గడిపేను. ఆ తరవాత నన్ను మెడికల్ యూనిట్‌కు బదిలీచేసేరు, మన యుద్ధఖైదీలను బాగు చెయ్యడానికి. అక్కడ స్ట్రెచ్చెర్లుమొయ్యడం, గాయాలకు కట్లు కట్టడమున్ను. పేరుకే మెడికల్ యూనిట్టుగాని ఒక్క మందూ వుండేదిగాదు. కట్టిన గుడ్డలే మళ్లీ బేండేజి చేస్తూ వుండేవాళ్లం. ముప్పాతిక చావులే. బ్రతికిన పాతికా అదృష్టం బావున్నవాళ్లన్నమాట... మరి కొంతకాలానికి మమ్మల్ని న్యూగినీ పంపించేరు. ఆ స్టీమరుప్రయాణం నువ్వు ఊహించుకోలేవు. ఓ చిన్న కేబినులోకి మమ్మల్ని నూటయాభైమందినీ తోలేరు పశువుల్లాగ. పశువులగుంటడు గేదెమీద కూర్చుని అటూ యిటూ గొడ్లమీద కర్ర తిరగేసినట్టు, కేబినులోకి వెళుతూవుంటే ఆ గుమ్మందగ్గిరున్న జపానువెధవ మా బుర్రలమీద టింగుటంగుమని బేటనుతో కొడుతూనే వుండేవాడు. ప్రొద్దున్న ఒకమారు, సాయంత్రం ఒకమారు మాత్రం డెక్కుమీదికి రానిచ్చేవారు. అంతే. మళ్లీ ప్రకృతిమాతదర్శనం లభించేది కాదు.

మేమూ న్యూగినీతీరాన్ని అడుగుమోపేమో లేదో, ఆ ద్వీపానికి అవతలప్రక్క మిత్రసేనలు దిగివున్నాయనీ, చాలా నష్టం కలగజేస్తున్నాయనీ అలజడి కలిగింది జపానువాళ్లలో. ఆరాత్రే అకస్మాత్తుగా ఓ విమానదాడి జరిగింది. మా కాపలావాళ్లు రహస్యస్థలాల్లోకి పారిపోయేరు తల దాచుకోడానికి. పుచ్చపువ్వులాంటి వెన్నెట్లో నే నిదంతా గమనిస్తూనే వున్నాను. చుట్టుపక్కల నిర్బంధం లేకపోవడంతో నే పదిగజాలు అలా వెళ్లబోయేసరికి కాలి కేదో తగిలింది. యుద్ధరంగంలో అలా శవాల్ని తన్నుకుంటూపోవడం మామూలే మాకు. అయినా మనవాడెవడయినా నేమో నని వంగి చూసేను. జపానువాడు! వాడి చేతిని వున్న వాచీ తీసుకుని అప్పుడు నాలుగున్నర అయిందని తెలుసుకున్నాను. వాడి జేబులూ, సంచీ తడిమేసరికి నాలుగు బిసకత్తులూ, కొంచెం టీ దొరికింది. వాటితో క్షుద్బాధ తీర్చుకుని యింకా శోధించగా కొన్ని మాపులూ, ఓ కెమేరా, ఫోటోలూ, టార్చిలైటూ, బ్రాందీబుడ్డీ దొరికేయి. ఇవి అన్నీ భద్రపరుచుకుని, ఆప్రదేశం అంతా తిరిగి తిరిగి మూర్తిగార్నీ, రావుగార్నీ—ఖైదీలు కాకముందు వాళ్లు యిద్దరూ కేప్టెన్లు—కలుసుకున్నాను. మూర్తిగారు స్మారకం లేకుండా పడివుంటే మూడు మైళ్లు మేం యిద్దరం మోసుకెళ్లి ఓ గుహలాంటి దాన్లో చేర్చేం. అక్కడయినా అరఘంట అవస్థపడితేనే కాని ఆయనకు తెలివిరాలేదు. మేము బడలిక తీర్చుకుంటూంటే తెల్లవారింది. ఆ ప్రభాతరాగోదయంలో ఆ ప్రకృతిదృశ్యం ఎంతో రమణీయంగా కనిపించింది. కాని పైకి కదిల్తే ఎక్కడ ఏమి కీడు మూడుతుందోనని భయం. ఎనిమిదింటిదాకా అలాగే వుండిపోయేం. అప్పటికీ చడి యేమీ లేదు. ఎదరనున్న తుప్ప ఒకటి పీకి ఆరెమ్మలతో పళ్లు తోముకున్నాం. కనుచూపుదూరాన్ని చెట్లు కనిపించేయి ఏవోను. మొదట్లో పోకచెట్లనుకున్నాం; కాని కొబ్బరి చెట్లేను. అక్కడే మా కాంపు. కొబ్బరిగుజ్జురు ఆహారం, ఆనీళ్లే పానీయమున్ను. ఆచెట్టే ఎక్కి నాలుగుమూలలా చూస్తూవుండేవాళ్లం మిత్రగుడారాలు కనిపిస్తాయేమోనని. రెండురోజులు ఏమీ ఆచోకీ దొరకలేదు. అకస్మాత్తుగా నాకు దొరికిన మాపులసంగతి జ్ఞాపకంవచ్చింది. అందులో మార్కు చేసివున్న డేంజరుస్థలాలే (Danger zones) మిత్రసైన్యాలు విడిసివున్న చోట్లని నిశ్చయపరుచుకొన్నాం. అడివిలోంచి మార్గం చేసుకుని వెళ్లి అక్కణ్ణుంచి మళ్లీ చూసి స్థిరమయిన వార్త తెలుసుకోవాలి.

రావుగారు యీపనికి పూనుకున్నారు. వెళ్లి రెండు రోజులయినా అతని కబురే లేదు మాకు. ఏదో కొంపములిగింది అనుకుంటూ వుండగా, మూడో నాటి పొద్దున్నే రోజుకుంటూ వచ్చేడు ఆయన. మనవాళ్ల కాన్వాయి పడమరగా వెళ్తోందనీ, తనకు జ్వరం తగలడంచేత అంతకన్నా త్వరగా రాలేక పోయినాననీ చెప్పేడు. ఇహ మా ఆనందం ఏమని చెప్పను! రావుగారికి నా దగ్గరున్న బ్రాందీ యిచ్చేను. మా మాపుల సహాయంతో కాన్వాయిని ఎంతదూరంలో కలుసుకోగిలమో అంచనాకట్టి సులువుగా చేరుకున్నాం. కాన్వాయికమేండరు మమ్మల్ని చాలా ఆదరించేడు. ఆ రాత్రి సుష్టుగా భోంచేసిన తరవాత ఓ లారీ యిచ్చి మమ్మల్ని బేస్ కాంపుకు పంపించేడు. రూల్సు ప్రకారం అక్కడ దొరదగ్గిరకు తీసుకెళ్లేరు మమ్మల్ని. అతను ఎవరనుకున్నావ్? మొదట్లో సింగపూరులో నాపైని వుండేవాడేను. సెల్యూటుచేసి, "నేను ఫలానా వాణ్ణి. అల్లావేళ జపాను సైన్య విధ్వంసం గురించి నేను మనవిచేసిన మాటలు తమకు జ్ఞాపకం వున్నాయా?" అన్నాను. దొర విస్తుబోయి చూస్తున్నాడు. మాపులు, ఫోటోలు అన్నీ అతని ఎదుట పెట్టి "యిహ మీరు పూనుకోవడమే తరవాయి; నా ప్రతిజ్ఞ నేను నెరవేర్చేను" అన్నాను. దొర అమాంతం కౌగిలించేసుకున్నాడు. నాకు కేప్టినుహోదా వెంటనే యివ్వవలసిందని తంతి యిచ్చేడు. ఆ రాత్రీ, మర్నాడూ నాతో యుద్ధ సన్నాహాలు ముచ్చటించి, నాసౌకర్యాలకు అన్ని ఏర్పాట్లూ చేయించి పంపేడు."

—అని యింకా ఏమిటో చెప్పబోతున్నాడు వెంకట్రావు. మేం యింత వేగిరం తెమిలేటట్టు లేమనుకుని ఆ అర్ధరాత్రి కాఫీ కాచి యిచ్చింది జానకమ్మ. అలా కబుర్లతోనే తెల్లారిపోయింది. ప్రక్కనున్న రేడియో పెట్టేం వార్తలకోసమని. జయభేరీ మ్రోగింది. పశ్చిమయుద్ధం అంతం అయిపోయిందనీ, విజయోత్సవాలు ఫలానానాడు జరుగుతాయనీ తాజావార్త!

"వాళ్ల మొహం. యీ విజయోత్సవం నాదీ. చూడండి ఎల్లా చేస్తానో" అంది జానకమ్మ—యిడ్లీ, కాఫీ యిస్తూనూ.